క్లుప్తంగా

పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'దోర్నాల'



జనగామ: పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, దోర్నాల వెంకటేశ్వర్లును నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దోర్నాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. జిల్లాలో పద్మశాలి సామాజిక వర్గ అభ్యున్నతి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా దామోదర్



చిల్పూరు: పద్మశాలి సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా చిన్నపెండ్యాలకు చెందిన ఆ సంఘం మండల అధ్యక్షుడు, నియోజకవర్గం ఇన్‌చార్జ్ దామోదర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ ఈ పదవితో బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్‌గా నాగయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్‌గా ఘన్‌పూర్ పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు సింగపురం నాగయ్య నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గణిపాక మహేందర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాగయ్య మంగళవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్టీని బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా రాజు

బహుజన సమాజ్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ మండల అధ్యక్షుడిగా మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన నారబోయిన రాజును నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్, నియోజకవర్గ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజు ఘన్‌పూర్‌లో విలేకరుతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రమేశ్

చిల్పూరు: సీపీఎం మండల కార్యదర్శిగా కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన సాదం రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సీపీఎం 3వ మహాసభ నిర్వహించగా 7గురితో మండల కమిటీని ఎన్నుకున్నారు. రెండోసారి రమేశ్ కార్యదర్శిగా, సభ్యులుగా పోలు సంపత్, సాదం శ్రీనివాస్, కన్నెబోయిన రవి, అవుల ప్రభాకర్, అపరాదపు రాజు, బర్మ రవిలు ఎన్నికయ్యారు.

రాహుల్ సదస్సుకు డీసీసీ అధ్యక్షుడు 'కొమ్మూరి'



జనగామ: రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి జరగనున్న కుటుంబ సమగ్ర సర్వే నేపథ్యంలో హైదరాబాద్ మహాత్మాగాంధీ ఐడియాలజీ ఇనిస్టిట్యూషన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సదస్సుకు ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ హాజరు కాగా, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. సదస్సులో కొమ్మూరి పాల్గొన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు డాక్టర్ రాజమౌళి, నూకల బాల్‌రెడ్డి, రాజ బోయిన లక్ష్మీనారాయణ, జిల్లెల దయాకర్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, దాసరి క్రాంతి, బచ్చన్నపేట యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్య



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామానికి చెందిన రైతు ఆకుల నర్సయ్య(56) తరచుగా మద్యం తాగి గొడవ చేస్తుండగా భార్య, కుమారుడు మందలించారనే మనస్తాపంతో తమ వ్యవసాయభూమి వద్ద సోమవారం గడ్డిమందు తాగి ఆత్మహత్నాయత్నానికి ప్రయత్నించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఏఎస్‌ఐ రాజమౌళి తెలిపిన వివరాలు.. ఛాగల్లుకు చెందిన ఆకుల నర్సయ్య వ్యవసాయంతో పాటు బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, కొంతకాలంగా మద్యానికి బానిసైన నర్సయ్య ఈనెల 3న రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లి భార్య రమతో గొడవపడగా భార్య రమ, కుమారుడు రాజేష్ మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన అతడు ఈనెల 4న వ్యవసాయ బావి వద్ద గడ్డిమందు తాగి భార్య, కుమారుడికి ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి వెళ్లిన వారు నర్సయ్యను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టులు

● పట్టించుకోని అధికారులు

తరిగొప్పుల: మండలంలోని పలు రహదారులపై నిర్మించిన కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. పలు చోట్ల కల్వర్టుల రక్షణ గోడల వద్ద రోడ్డు కోతకు గురయ్యింది. మండలకేంద్రం పెద్ద చెరువు చిన్న మత్తడి సమీపంలో జనగామ–హుస్నాబాద్ ప్రధాన రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అదేవిధంగా మండలకేంద్రం నుంచి అబ్దుల్‌నాగారం వెళ్లే మార్గంలో కల్వర్టు కోతకు గురైంది. ప్రమాదాలు చోటుచేసుకోకుండా సమీప రైతులు కర్రకు ఎర్ర వస్త్రాన్ని కట్టారు. కల్వర్టు కోతకు గురై నెలలు గడుస్తున్నాయి. ముళ్ల పొదలు ఉండడంతో వాహనాలు సమీపానికి వచ్చే వరకు కల్వర్టు కోతకు గురైన విషయం తెలియడంలేదు. ఇక్కడ వాహనాలు ఎదురెదురుగా ప్రయాణించలేని పరిస్థితి. రాత్రి సమయంలో మరీ ప్రమాదకరంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



కోతకు గురైన జనగామ-హుస్నాబాద్ రహదారి



కోతకు గురైన అబ్దుల్‌నాగారం రోడ్డులోని కల్వర్టు

ఘనంగా నాగుల చవితి



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పూజ చేస్తున్న భక్తులు



కొడకండ్ల: పూజలు చేస్తున్న మహిళలు

జనగామ: పట్టణంలోని బాణాపురం అయ్యప్ప ఆలయంలో నాగుల చవితి పురస్కరించుకుని మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన పూజారి కాసోజు రాజేశ్వరాచార్యుల మంత్రోచ్చారణల నడుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వందలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: నాగుల చవితి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని భక్తాంజనేయస్వామి, శివాలయం, నాగులమ్మ ఆలయాల్లో నాగుల చవితి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాలకు చేరుకుని పుట్టలో పాలుపోసి మొక్కులు సమర్పించుకున్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు అంత్యంత భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలో శివాలయంలో మహిళలు పుట్టకు పాలు పోసి ప్రత్యేక పూజలు చేపట్టారు.



జఫర్‌గఢ్‌లో..

దేవరుప్పులలో..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని భ్రమరాంబమల్లిఖార్జునస్వామి ఆలయ సమీపంలో నాగుల పంచమి పురస్కరించుకుని పుట్టకు పాలు పోసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారి పెద్దాపురం వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక అభిషేకం చేశారు.

బడిలోనే దేశ నిర్మాణం జరగాలి



మాట్లాడుతున్న సోమేశ్వరరావు

జనగామ: బడిలోనే దేశ నిర్మాణం జరగాలని గ్లోబల్ ఫౌండేషన్ రాష్ట్ర బాధ్యుడు పూస్కూరి సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. జనగామ మండలం పెంబర్తి బాల సంస్కార్ కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి తరం యువత, పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. సమాజానికి దగ్గరగా ఉంటూ, చదువుతో పాటు సంస్కారం నేర్చుకున్నప్పుడే దేశ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బాల సంస్కార్ కేంద్రం టీచర్లు కావ్య శ్రీ, శ్రీలత ఉన్నారు.

'గ్రాండ్ హెల్త్ చాలెంజ్' ప్రారంభం

జనగామ: జనగామ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు చేపట్టిన గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌ను ఎస్సై రాజేశ్ ప్రారంభించారు. మంగళవారం డిపో మేనేజర స్వామితో కలిసి ఎస్సై ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. డిపో ఆవరణలో ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ఉద్యోగి లేదా అతని భార్యను తీసుకు రావచ్చన్నారు. పరీక్షల్లో ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తేలితే మెరుగైన వైద్య సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ స్టాఫ్, డిపో సూపర్ వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై

ఉత్సవాలకు విరాళం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన కంఠ మహేశ్వరస్వామి ఉత్సవాలకు గాను మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి తమవంతుగా గౌడసంఘానికి మంగళవారం రూ.51వేలు విరాళంగా అందించారు. గ్రామంలో గత మూడురోజులుగా తాటికొండ గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు తమవంతుగా రూ.51వేలు అందిస్తున్నట్లు తెలిపారు. కాగా ఉత్సవాల్లో భాగంగా ఉదయం పుట్ట బంగారం తీయడం, సాయంత్రం బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు బొంగోని యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షులు దేశిని రమేష్‌గౌడ్, కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

'ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదు'

రఘునాథపల్లి: మండలంలోని శ్రీమన్నారాయణపురం–బానాజీపేట రహదారి ఇరువైపులా కంప చెట్లు రోడ్డును కమ్మేస్తుండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని పలు మార్లు కోరినా పట్టించు కోని ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖాధికారులపై రఘునాథపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఠాకూర్ గణేష్‌సింగ్ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రోడ్ల మేంటనెన్స్ పేర రూ.లక్షలు దుర్వినియోగం చేసి, కంపచెట్లు తొలగించడానికి నిధులు లేవంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సోమవారం భాంజీపేట గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ రచ్చ శ్రీహరి ఇదే రోడ్డు ప్రమాదంలో మరణించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఏఓ మన్సూరికి వినతి పత్రం ఇవ్వగా సానుకూలంగా స్పందించారని ఠాకూర్ గణేష్‌సింగ్ తెలిపారు.



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న గణేష్‌సింగ్

ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

స్టేషన్‌ఘన్‌పూర్: పదో తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదివి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, డీఈఓ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు టెస్ట్ క్లాస్ అనేది తొలిమెట్టు లాంటిదని, విద్యార్థులు కష్టపడి ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కొమురయ్య, హెచ్‌ఎం సంపత్, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, సునీత, లవన్, జ్యోతి, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీలత పాల్గొన్నారు.

ఇంటర్‌విద్యతో ఉజ్వల భవిష్యత్‌కు పునాది

దేవరుప్పుల: ఇంటర్మీడియట్ విద్యాభివృద్ధితోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులని ఎస్సై ఊర సృజన్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమాజ రుగ్మతలు, కొత్త చట్టాలపై విద్యార్థులకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

రఘునాథపల్లి: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని నిడిగొండ పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నిడిగొండలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఏ గ్రేడ్ రకం వరి ధాన్యం క్వింటాల్‌కు రూ 2,320, సాధారణ రకానికి రూ.2,300లతో సన్నాలకు రూ.500లు బోనస్ ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్, ఇన్‌చార్జ్ డీసీఓ మురళీరమణ, సొసైటీ వైస్ చైర్మన్ బొక్క రామచంద్రయ్య, సీఈఓ అఖిల్, డైరెక్టర్లు గొట్టం కరుణాకర్‌రెడ్డి, యామంకి మనోహర్, లక్ష్మారెడ్డి, అనుముల రామచంద్రయ్య, మాల రాజు, శాంతోజీ, ఐలేష్, రాఘవాచారి పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి, డైరెక్టర్లు

ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: వివిధ ప్రభుత్వ యాజమాన్యాలలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులు వరంగల్–ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ కోరారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2025 మార్చిలో వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ మూడు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాష్, కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్, కోశాధికారి తాడూరి సుధాకర్, కోరుకొప్పుల రాజు, ముడిదె రాము తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న సీఎం

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను దగా చేస్తూ రాక్షసపాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాజయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో ధాన్యం కుప్పలు పోసుకున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదిరోజులుగా కొనుగోళ్లకు నోచుకోక తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ అధ్యక్షతన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పగూడెంలో పది రోజుల క్రితం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆర్భాటంగా సెంటర్‌ను ప్రారంభించారని, చివరిగింజ వరకూ కొనుగోళ్లు చేస్తామని రైతులకు కడియం కళ్లబొల్లి మాటలు చెప్పారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారపాక రవి, నాయకులు ఆకుల కుమార్, తాటికొండ సురేష్‌కుమార్, కనకం గణేష్, మైబుపాషా, మహేశ్, నర్సింహరాములు, మారెపల్లి ప్రసాద్, గుర్రం చిట్టిబాబు, మల్లేష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాజయ్య

లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం ఏర్పాటుకు కృషి

పాలకుర్తి టౌన్: స్వాతంత్ర సమరయోధుడు, రాష్ట్ర సాధన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని పాలకుర్తిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహ స్థలాన్ని రాజ్‌కుమార్ పరిశీలించారు.

కెపాసిటర్లతో విద్యుత్ ఆదా

పాలకుర్తి టౌన్: విద్యుత్ వాడకాన్ని వృథా చేయకుండా ఆదా చేయడం కోసం రైతులందరూ పంపుసెట్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని విద్యుత్ శాఖ డీఈ రాంబాబు రైతులకు సూచించారు. మంగళవారం మండల మండల కేంద్రంలో పోలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేశారు. ఏఈలు ఏ రణదీర్, మహేందర్‌రెడ్డి, రమేష్‌నాయక్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించండి

పాలకుర్తి టౌన్: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కొండ సురేఖను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం హనుమకొండలో మంత్రి నివాసంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాలకుర్తి నియోజవకర్గ అభివృద్ధి పనులపై వివరించారు.

'గోర్ బోలి' నమోదు చేయించాలి

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో గిరిజనులంతా మాతృభాషను గోర్ బోలి అని నమోదు చేయించుకోవాలని రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర రాథోడ్ నాయక్ అన్నారు. మంగళవారం గిరిజనులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పించాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం పోచన్నపేటలో రావుల రవీందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల మహా సభలో ఆయన మాట్లాడారు. శేఖర్, విజేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు సహకరించండి

లింగాలఘణపురం: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ రోడ్ సైక్లింగ్ పోటీల నేపథ్యంలో ప్రయాణికులు సహకరించాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 5,6 తేదీల నుంచి జరుగుతున్న సైక్లింగ్ పోటీల్లో లింగాలఘణపురం నుంచి నెల్లుట్ల వరకు వెళ్లే వారంతా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వయా పటేల్‌గూడెం, లేదా నాగారం మీదుగా మండల కేంద్రానికి వచ్చి సహకరించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన చెట్కూరి ఐలమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ ఏడునూరి రవీందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2 వేల సాయం అందజేశారు.

ఆస్పత్రి ఖర్చులకు..

బచ్చన్నపేట: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తమ్మడపల్లికి చెందిన మనుపాటి రమేశ్ ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేల సాయం మంగళవారం అందజేశారు.

విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న సీపీఎం మండల మహాసభను విజయవంతం చేయాలని సీపీఎం గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో నాయకులతో కలిసి మహాసభ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయండి

జనగామ రూరల్: ఎర్రకుంట తండాలో గత నెల పిడుగుపాటుకు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయాలని మంగళవారం రైతులు ట్రాన్స్‌ఫర్మర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత నెల పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే మరమ్మతు చేయాలని అధికారులను కోరినా పట్టించుచకోవడం లేదని, అందుకే నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. రైతులు వస్రం, వర్ధన్, శ్రీను, గణేశ్, పంతులు, శ్యాం పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు పెంచాలి

బచ్చన్నపేట: బహుజన సమాజ్ పార్టీ అభివృద్ధికి సభ్యత్వ నమోదును పెంచాలని ఆ పార్టీ రాష్ట్ర ఈసీ మెంబర్ నిర్మల సత్యం కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ జెరిపోతుల మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

గుట్కాలు విక్రయిస్తే చర్యలు



కొడకండ్ల: ప్రభుత్వ నిషేధిత గుట్కాలను విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ స్థానిక ఎస్సై మొండ్రాయి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామ బొడ్రాయి వద్ద ఇదే గ్రామానికి చెందిన కందుకూరి శ్రీను అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడారు. కాగా, అతడిని పట్టుకొని విచారించగా రూ.1,19,700 విలువ గల ప్రభుత్వ నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల స్వాధీనంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై చింత రాజు, కానిస్టేబుల్స్ రఘుపతి, భిక్షపతిలను సీఐ అభినందించారు.

వ్యక్తికి రెండు నెలల జైలు

రఘునాథపల్లి: ఇద్దరి మధ్య జరిగిన గొడవలో వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన యువకుడిని రెండు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ జనగామ కోర్టు అసిస్టెంట్ సెషన్ జడ్జి సుచరిత మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో ని రామరాయిని బంగ్లా గ్రామానికి చెందిన గుళ్ల కనకయ్య(48), యువకుడు మద్దెల ప్రజ్వల్ 2021లో ఘర్షణ పడ్డారన్నారు. ఈ ఘటనలో వయస్సులో తనకంటే చిన్నవాడైన ప్రజ్వల్ కొట్టడాన్ని జీర్ణించుకోలేని కనకయ్య అక్కడే పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి భార్య బాలమని ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేశారు. ఘటనకు సంబంధించిన కేసు విచారించిన జడ్జి, జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు.

కాల్వలో పడిన కారు

జనగామ రూరల్: అదుపు తప్పి కారు కెనాల్ కాల్వలో పడిన సంఘటన మంగళవారం మండలంలోని ఎల్లంలలో చోటు చేసుకుంది. ఎల్కతుర్తి మండలం బావుపేటకు చెందిన రాము స్విఫ్ట్ డిజైర్‌లో హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఎల్లంల శివారులో కారు అదుపు తప్పి కెనాల్ కాల్వలోకి దూసుకెళ్లింది. కాగా రాముకు ఎలాంటి గాయాలు కాలేదు.

'సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం'



మాట్లాడుతున్న రమణారెడ్డి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అన్నదాతలు ఆరుగాలు కష్టించి పండించిన ధాన్యాన్ని కేంద్రాల్లో కొనుగోలు చేయకపోవడంతో మధ్య దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారన్నారు. సమావేశంలో పూర్ణచందర్, చెంద్రారెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన సామగ్రి వద్ద రోదిస్తున్న కుటుంబం

రఘునాథపల్లి: షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని గబ్బెట గ్రామానికి చెందిన పెండెల నరేశ్ ఇల్లు దగ్ధమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పేదరికానికి చెందిన రైతు నరేశ్ ఇంటికి తాళం వేసి సతీమణి సరితతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో నరేశ్ ఇంట్లో ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి నరేశ్‌కు సమాచారం ఇచ్చారు. స్థానికులు మంటలు ఆర్పేసేందుకు శ్రమించినా అప్పటికే ఇంట్లో ఉన్న రూ.35 వేల నగదు, ఇంటి సామగ్రి, పలు వస్తువులు కాలి బూడిదకావడంతో నిరాశ్రయుల య్యారు. దాదాపు రూ.5 లక్షల ఇంటి సామగ్రి దగ్ధం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు నరేశ్ కోరాడు.